క్లుప్తంగా

గుత్తి ఎస్ఐ-2 గా రామకృష్ణారెడ్డి



గుత్తి: గుత్తి ఎస్ఐ-2 గా రామకృష్ణారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డీహీరేహాళ్‌లో పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న రామకృష్ణారెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు గుత్తికి బదిలీ చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి సమక్షంలో రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రామకృష్ణారెడ్డిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హెచ్ఎం ఆస్మాసయోద ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



నాగుల విగ్రహాలను ప్రతిష్టించిన దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర సామి, నాగుల విగ్రహ ప్రతిష్ట ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

గొర్రెల కాపరి ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో గొర్రెల కాపరి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన తలారి గంగప్ప కుమారుడు తలారి సుధాకర్ గొర్రెల కాపరిగా పని చేసేవాడు. అయితే గొర్రెలు కాసేందుకు సరిగా వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన సుధాకర్ ఇంట్లోని విషద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సుధాకర్‌ను హుటాహుటినా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి మెరుగుపడినట్లు సమాచారం. పామిడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామితోపాటు 108 సాలాగ్రామ శివ లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: కోటంకలో ఆదివారం అన్నదమ్ముల ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు మధుసూదనరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటరామిరెడ్డి, తాతిరెడ్డి పొలం విషయంలో వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటరామిరెడ్డి కలిసి తాతిరెడ్డిపై దాడి చేశారు. తాతిరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

కర్ణాటక సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ నరసింగప్ప, సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది

గుంతకల్లుటౌన్: ఏపీ సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకలో శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం గుంతకల్లు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని జొనేకల్లు చెక్‌పోస్టు వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ సదరు చెక్‌పోస్ట్ మీదుగా అక్రమ మద్యం, డబ్బు రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సెబ్ ఎస్ఐ జయనరసింహారెడ్డి, స్పెషల్ పార్టీ, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనలతో తీరనున్న వేదన

- యల్లనూరు మండలానికి సీఎం జగన్ వరాల జల్లు
- బ్రిడ్జి, కాజ్ వే నిర్మాణానికి రూ.26.75 కోట్ల మంజూరు
- శింగనమల ఎమ్మెల్యే చొరవ
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు



శింగవరం వద్ద చిత్రావతి నదిలో వేసిన మట్టిరోడ్డు

యల్లనూరు: చిత్రావతి నదిని ఆనుకుని గ్రామాలు వర్షాకాలంలోపాటు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)నీటితో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో నది ప్రవహించే సమయంలో వారు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ తలరాత మారదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేసేవారు. ప్రజల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రం అధికారులు తూతూ మంత్రంగా రోడ్లు వేసి చేతులు దులుపుకునేవారు. అయితే ఇటీవల నార్పలలో జరిగే జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సమస్యను సీఎంకు వివరించారు. యల్లనూరు మండలంలో చిత్రావతి నదిపై రెండు కాజ్‌వే వంతెన బ్రిడ్జిలు మంజూరు చేయాలని విన్నవించారు. దీంతో స్పందించిన సీఎం అక్కడికక్కడే సభలో ప్రజల సౌకర్యార్థం చిత్రావతి నది మీద యల్లనూరు మండలం కోడిమూర్తి–చిలమకూరు వరకు రూ.15 కోట్లతో కాజ్‌వే, యల్లనూరు మండలం శింగవరం, చింతకాయమంద, తిమ్మంపల్లి –పులివెందుల రోడ్డు రాకపోకల నిమిత్తం రూ.11.75 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలియజేశారు.

తీరనున్న కష్టాలు

శింగవరం, కల్లూరు, దంతలపల్లి, కొత్తపల్లి, వెంకటాంపల్లి, చింతకాయమంద, గొడ్డుమర్రి, తిమ్మంపల్లి, చిలమకూరు, కోడిమూర్తి, యల్లనూరు, అచ్యుతాపురం, వాసాపురం తదితర గ్రామాల ప్రజలు తిమ్మంపల్లి –పులివెందుల రోడ్డు తిరుగుతుంటారు. సీఎం వైఎస్ జగన్ బ్రిడ్జిని మంజూరు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక చిలమకూరు నుంచి తిరుమలాపురం మీదుగా యల్లనూరుకు చేరుకునేందుకు 8 కిలోమీటర్లు మేర దూరం ఉంది. అదే చిత్రావతి నది మీద కోడిమూర్తి మీదుగా వెళ్లితే 3 కిలోమీటర్లు తగ్గుతుంది. బ్రిడ్జి నిర్మాణంతో తమకు దారికష్టాలు తప్పుతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ సార్ చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇస్తే తప్పకుండా చేసి చూపిస్తాడు. ప్రజా సమస్యలు, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. యల్లనూరు మండలానికి రెండు బ్రిడ్జిలు రావడం ఓ వరం. ప్రజలు చిత్రావతి నదిలో అల్లాడిపోయేవారు. ఇప్పుడు సమస్యకు పరిష్కారం దొరికింది.

– గంగాదేవి, ఎంపీపీ యల్లనూరు

శాశ్వత పరిష్కారం దొరికింది



ఎన్నో ఏళ్లుగా ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్య ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం దొరికింది. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా అధికారులతో మాట్లాడతాం. చిత్రావతి నదిలో బ్రిడ్జిలు లేక ప్రజలు తీవ్రఅవస్థలు వారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సమస్య తీరనుంది.

– భోగతి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ యల్లనూరు

బ్రిడ్జి నిర్మాణంఆనందదాయకం



కోడిమూర్తి– చిలమకూరు నడుమ చిత్రావతి నదిలో నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది. చిత్రావతి నదికి నీరు వస్తే అటు వాహనదారులు ఇటు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. గతేడాది ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో విద్యార్థులు పుస్తకాల బ్యాగులు నెత్తినపెట్టుకొని నీటిలో ఈదుకుంటూ వెళ్లారు.

– నాగరాజు, చిలమకూరు సర్పంచు

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



చాలా సంవత్సరాల నుంచి చిత్రావతి నదికి నీరు వస్తే రాకపోకలు బంద్ అయ్యేవి. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మంచిదే. ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది. కోడిమూర్తి– చిలమకూరు బ్రిడ్జి మంజూరు చేయడంతో హర్షణీయం.

– రామాంజులరెడ్డి, సర్పంచ్, తిరుమలాపురం

చింతలరాయుడిని దర్శించుకున్న జడ్జి



జడ్జి శ్రీలతకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: ప్రసిద్ధ చింతల వెంకటరమణ స్వామిని ఆదివారం జిల్లా వినియోగదారుల ప్రత్యేక కోర్టు జడ్జి శ్రీలత, చిత్తూరు జిల్లా కోర్టు అడ్మిన్ ఏఓ ప్రసన్నకుమార్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా వీరికి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు మురళీబట్టార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయంలోని శిల్పకళా చాతుర్యాన్ని, ఆలయ చరిత్రను, ప్రాశస్త్యాన్ని అర్చకులు మురళీబట్టార్ వివరించారు.

దామోదరం సంజీవయ్య వర్ధంతి

రాప్తాడురూరల్: 'ఆలిండియా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బ్యాక్ వర్డ్ క్లాసెస్ అండ్ మైనార్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్సీఈడబ్ల్యూఏఎస్‌టీఏఎంబీ) అధ్వర్యంలో దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు వంకరాజు కాల్వ గోవిందరాజులు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు ఎ.గోవిందు, సి. మల్లికార్జున, జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు వలిగొండ రామకృష్ణ, ఎం.జయరాముడు, వైస్ ప్రెసిడెంట్ కోటి మల్లేషు, వై. భైరవ కుమార్, సాకే వెంకట రమణ, యస్.మహమ్మద్ రఫీ, బి. లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జి.కొట్టాలలో ఘనంగా గంగమ్మ దేవర



అలంకరణలో గంగమ్మ అమ్మవారు



వైస్ ఎంపీపీ ప్రభావతి కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: జి.కొట్టాల గ్రామంలో ఆదివారం గంగమ్మ దేవర ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లల్లో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఇళ్లన్నీ బంధువులు, స్నేహితులతో కిటకిటలాడాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.

13న రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురంలో ఈనెల 13న హనుమాన్ జయంతి సందర్భంగా తాళాల భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శనివారం(12వ తేదీ) రాత్రి ఆంజ నేయ స్వామి భజన మండలి, గ్రామపెద్దల సమక్షంలో పోటీలు ప్రారంభిస్తామన్నారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలతోపాటు మరో 18 బృందాలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 7780341202, 9573437160 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేత బుక్కరాయసముద్రం జట్టు



ట్రోఫీతో బుక్కరాయసముద్రం జట్టు

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన అంకాలమ్మ తల్లి క్రికెట్ టోర్నీ విజేతగా బుక్కరాయసముద్రం జట్టు నిలిచింది. ఆదివారం ఫైనల్ మ్యాచ్ బుక్కరాయసముద్రం, మడ్డిపల్లి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మడ్డిపల్లి జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 70 పరుగులు చేయగా, బుక్కరాయసముద్రం జట్టు కేవలం 7.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 76 పరుగుల చేసి విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.50 వేలు ప్రైజ్ మనీ మణికందన్ సాగుబడి ఫర్టిలైజర్ నిర్వాహకులు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన మడ్డిపల్లి జట్టుకు రూ.25 వేలను టోర్నమెంట్ నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డి అందజేశారు.

అబ్దుల్‌హై ఖాద్రీ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



చిన్నారులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: అబ్దుల్ హైఖాద్రీ వెల్ఫేర్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ నేత, ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక రోజా మసీద్ సమీపంలోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ పాఠశాల వద్ద సయ్యద్ అబ్దుల్ హైఖాద్రీ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఫయాజ్‌బాషా ఖత్నా చేయించుకున్న చిన్నారులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. అబ్దుల్ హైఖాద్రీ వెల్ఫేర్ ట్రస్టు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా, ప్రభుత్వ ఖాజీ హయత్ ఖాద్రీ ఇక్బాల్, అహ్మద్ రజాసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందరికీ రక్షణ శుభవార్త సభలు

పామిడి: పట్టణ 44వ నెంబర్ జాతీయ రహదారిపై హనుమాన్ లింకురోడ్డు సర్కిల్ సమీపాన ఉన్న మైదానంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు అందరికీ రక్షణ శుభవార్త సభలు నిర్వహించనున్నట్లు శాశ్వత కృపా మినిస్ట్రీస్ నిర్వాహకులు ప్రభాకర్ ఛార్లెస్, పీటర్ విజయ్, ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్య ప్రసంగీకులుగా గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహెమ్యా విచ్చేయనున్నట్లు తెలిపారు. రోజూ సాయంత్రం పూట జరిగే సభలకు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సమ్మర్ క్యాంపు పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సర్పంచ్ ఓబులేసు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న గ్రంథాలయాధికారి కమ్మన్న, సిబ్బంది

పుట్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపునకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సర్పంచ్ ఓబులేసు విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జయరాములు మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేకంగా సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి విద్యార్థి ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రభుత్వ గ్రంథాలయాల్లో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు సమ్మర్ క్యాంపులకు సంబంధించిన బ్రోచర్లు, కరపత్రాలు ఆదివారం విడుదల చేశారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఎండీఓ చిత్రా శ్రీనివాసులు, గ్రంథాలయాధికారులు రామాంజనేయులు, వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక సోఫియాస్ట్రీట్‌లోని ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సోమవారం నుంచి 40 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించనున్న వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పి.కమ్మన్న తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. డ్రాయింగ్, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథమాటిక్స్, సాంస్కృతిక, క్రీడలపై నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లతో ఉచిత వేసవి శిక్షణ నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రాము, హేమలత పాల్గొన్నారు.

ముగిసిన సుడిబండి తిరునాల



అలంకరణలో సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలు

పామిడి: రామరాజుపల్లిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సుడిబండి(బండిశిల) తిరునాల ఆదివారం ముగిసింది. గ్రామంలోని సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవరలో భాగంగా అతిథులను ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాలురెడ్డి, కంబగిరిరెడ్డి, రామశేఖర్‌రెడ్డి ఆదివారం విలేకరులకు తిరునాల విశిష్టతను వివరించారు. సుంకులమ్మ, ముత్యాలయ్య రెడ్డి కులములోని గణేశం వంశంలో అక్కా తమ్ముళ్లుగా జన్మించారన్నారు. వారి మహిమలతో గ్రామం సస్యశ్యామలంగా విరాజిల్లుతోందన్నారు. దాదాపు రెండున్నర శతాబ్దాల నుంచి తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏటా వైశాఖ మాసం రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం నడుమ ఐదురోజుల పాటు తిరునాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాల తొలిరోజు తమ గ్రామం నుంచి వెళ్లిన సుడిబండి ఐదు రోజుల తర్వాత తిరిగి రావడంతో తిరునాల ముగుస్తుందన్నారు.

కార్తికేయునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు జరిగాయి. స్వామికి రాహుకేతు హోమాలు, పల్లకీ సేవ, ఆకుపూజ, కుజదోష, కాలసర్పదోష నివారణకు మూలమంత్ర బీజాక్షర హోమం చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి పూజలు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో జీమాను ఆదివారం నేలకూలింది. మధ్యాహ్నం సమయంలో వీచిన గాలికి ఒక్కసారిగా చెట్టు పెద్ద శబ్దంతో నేలకు ఒరిగింది. అయితే ఆ సమయంలో జనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి: మండలంలోని ఊరుచింతల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

యల్లనూరు: మండలంలోని కోడుమూర్తి, చిలమకూరు, అచ్యుతాపురం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.


టిప్పర్ల పట్టివేత

తాడిపత్రి: చల్లవారిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చిన్న పెద్దయ్య తెలిపారు. రాత్రి వేళ అక్రమంగా వంక సమీపంలో మట్టిని అక్రమంగా టిప్పర్లలో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి, రెండు టిప్పర్లను పట్టుకుని, రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

నైతిక విలువలు నేర్పాలి

అనంతపురం కల్చరల్: విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలని, అప్పుడే మంచి సమాజాన్ని నిర్మించగలుగుతామని స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. పట్టణ అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిరంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం సాయంత్రం విద్యార్థులకు సామాజిక బాధ్యత, నైతిక విలువలపై అవగాహన సదస్సు జరిగింది.

పురవీధుల్లో వీరభద్రస్వాముల సందడి



జీర్ణోద్ధరణలో ప్రాచీన బసవేశ్వరాలయం

అనంతపురం కల్చరల్: కర్ణాటక నుంచి తరలి వచ్చిన కళాకారులు వీరభద్రుడి వేషధారణతో అలరించారు. శివతాండవం చేస్తూ శివస్తుతితో ఖడ్గాలను, నందికోలును లయబద్ధంగా తిప్పుతూ సాగిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం నగర శివారులో భారీ ఊరేగింపు జరిగింది. ఆకుతోటపల్లి గ్రామంలో ఉదయం ప్రాచీన బసవేశ్వరస్వామి దివ్య ఆలయం యంత్ర ధ్వజస్తంభ ప్రతిష్టాపనలు, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకులు రాజేష్‌స్వామి, ఇతర పండితులు ఆలయంలో రెండు రోజులుగా సాగిన హోమాన్ని పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగించారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిన బీఎస్పీ నాయకులు

గుత్తి: చలో హైదరాబాద్ కార్యక్రమానికి గుత్తి నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బస్సులో తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని సరూర్ స్టేడియంలో బీఎస్పీ జాతీయ నేత మాయావతి నేతృత్వంలో జరుగనున్న సమావేశానికి గుత్తి నుంచి బస్సులో తరలివెళ్లారు. బీఎస్పీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, గుంతకల్లు నియోజకవర్గం అధ్యక్షుడు విజయ్, నియోజకవర్గం కన్వీనర్ వెంకట కొండయ్య, సీనియర్ నాయకులు రామాంజనేయులు, రంగనాయకులు, నాగేశ్వరరావు, రాధమ్మ తదితరులు ఉన్నారు.



పెన్నహోబిలంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

చలువ పందిళ్ల ఏర్పాటు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరిగే రథోత్సవానికి భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉత్తర ద్వారం నుంచి ఆలయ ఆవరణ మొత్తం చలువ పందిళ్లు అమర్చారు. ఈఓ మాట్లాడుతూ జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక నుంచి వచ్చే భక్తులు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేకంగా కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించామన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్రికెట్ కోచింగ్ సద్వినియోగం చేసుకోండి

రాప్తాడురూరల్: ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి కోరారు.ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్‌ను ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఏడీసీఏ కార్యదర్శి మధుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కోగటం మాట్లాడుతూ టీడీ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంతోమంది క్రికెట్ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. ఆర్ట్స్ కళాశాల పీడీ జబీవుల్లా, కోచింగ్ క్యాంపు నిర్వాహకులు టీవీ చంద్రమోహన్‌రెడ్డి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ యుగంధర్‌రెడ్డి, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల పీడీ వాసు, వైఎస్సార్‌సీపీ నేత యోగి రాయల్ పాల్గొన్నారు.